చెన్నై | శనివారం | మార్చి | 22 | 2014 సాక్షి

# అట్టపెట్టెల ధరలు 20 శాతం పెంపు

- ఆలిండియా అట్టపెట్టెల తయారీదారుల సమాఖ్య వెల్లడి
- ముడిసరుకు, ట్రాన్స్‌పోర్టు ధరలు పెరగడమే కారణం
- ఏప్రిల్ 1 నుంచి అమలులోకి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రామచంద్ర హెచ్.అరోరా

కొరుక్కుపేట, న్యూస్‌లైన్ :

అట్టపెట్టెల ధరలను అదనంగా 20 శాతం పెంచినట్లు ఆలిండియా అట్టపెట్టెల ఉత్పత్తిదారుల సమాఖ్య వెల్లడించింది. నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఆలిండియా అట్టపెట్టెల ఉత్పత్తిదారుల సమాఖ్య, దక్షిణ భారత అట్టపెట్టెల ఉత్పత్తిదారుల అసోసియేషన్ (సిక్మా) ప్రతినిధులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలిండియా అట్టపెట్టెల ఉత్పత్తిదారుల సమాఖ్య మాజీ అధ్యక్షులు అనీల్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ తమిళనాడు, పుదుచ్చేరిలో 100 చిన్న, మధ్యతరహా అట్టపెట్టెల తయారీ యూనిట్లు ఉన్నాయన్నారు. ఏడాదికి ఏడు లక్షల టన్నుల ఉత్పత్తి జరుగుతుందని తెలిపారు. విద్యుత్ సంక్షోభంతో ఉత్పత్తి అంతంతమాత్రంగా ఉండడంతో ఖర్చులు పెరిగిపోతున్నాయని, దీనికి తోడు ముడిసరుకు, క్రాఫ్ట్ పేపర్, రవాణా ఖర్చులు, లేబర్ చార్జీలు, స్టిచ్చింగ్ వైర్‌లు, జనరేటర్ ఖర్చులు, డీజిల్, దాదాపు 30 నుంచి 50 శాతం పెరిగిపోయాయని తెలిపారు. వీటి దృష్ట్యా అట్టల తయారీదారులు తీవ్రంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు. మూడేళ్ల నుంచి అట్టపెట్టెల ధరలను పెంచుతున్నట్లు వినియోగదారులకు సైతం సూచించామన్నారు. పెరిగిన ధరల దృష్ట్యా అట్టపెట్టెల ధరలను 20 శాతం పెంచుతున్నామని పేర్కొన్నారు. పెంచిన ధరలు ఏప్రిల్ 1వ తేదీ నుంచి అమలులోకి వస్తాయన్నారు. అఖిల భారత అట్టపెట్టెల ఉత్పత్తిదారుల సమాఖ్య అధ్యక్షులు రామచంద్ర హెచ్ అరోరా మాట్లాడుతూ ఎకో ఫ్రెండ్లీతో కూడిన విధంగా వివిధ డిజైన్లలో నాణ్యమైన అట్టపెట్టెలు అందివస్తున్నామన్నారు. వినియోగదారుల ఉత్పత్తులు టీ, బిస్కెట్స్, ఆయిల్, ఆహారం తదితర విలువైన వస్తువులకు అట్టపెట్టెలను తయారు చేసి అందిస్తున్నామన్నారు. కేంద్రంలో రానున్న కొత్త ప్రభుత్వం అట్టపెట్టెల పరిశ్రమలకు క్రాఫ్ట్ పేపర్‌పై దిగుమతి డ్యూటీని, ఎస్ఎస్ఐ ఎక్సైజ్ మినాహాయింపును రూ.1.5 కోట్ల నుంచి రూ.3 కోట్లకు పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో దక్షిణ భారత అట్టపెట్టెల ఉత్పత్తిదారుల అసోసియేషన్ సెక్రటరీలు రవిశంకర్, విన్సెంట్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.